# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :162 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 02-09-2025 | పేజీలు:4 వెల: 2.00


## అమెరికా ఉత్పత్తులను దేశంలో బహిష్కరించాలి

డోర్నకల్, సెప్టెంబర్ 01 : అమెరికా దేశ పెట్టుబడిదారి ఆగడాలు భారతదేశంలో రోజురోజు అధికమవు తున్నాయని, ఫలితంగా భారతదేశ కార్మికులు ముఖ్యంగా రైతులు తీవ్ర నష్టాలు చవిచూడవలసి వస్తుందని మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం సిఐటియు కార్యదర్శి దాసరి మల్లేశం విమర్శించారు. సోమవారం డోర్నకల్ సుభాష్ వీధి లోని కార్మికుల అడ్డా వద్ద ఆయన భవన నిర్మాణ మరి ఇతర కార్మికుల ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచంలో బడా పెట్టుబడిదారీ దేశంగా చలామణి అవుతున్న అమెరికా భారతదేశంపై వాణిజ్య సుంకాలను 50 శాతం పెంచడం మూలంగా మన దేశానికి తీవ్రమైన ఆర్థిక నష్టాలు సంభవిస్తున్నాయన్నారు. మెరికా నుండి దిగుమతి చేసుకుంటున్న వస్తువుల పైన భారతదేశం విధించే 11 శాతం వాణిజ్య సుంకాలను మోదీ ప్రభుత్వం రద్దు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారేమో 50% దిగుమతి సుంకాలను విధిస్తుంటే, మన దేశం అమెరికా వస్తువులకు విధించే ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులకు విధించే దిగుబడి సంఖం 11 శాతాన్ని పూర్తిగా రద్దు చేయడం మూలంగా దేశీ రైతులు నష్టపోతున్నారని, ఫలితంగా వారు పంటలపై పెట్టిన పెట్టుబడులు కూడా పంటలు

# వ్యక్తిగతంగా కోరుతున్నా.. తెలుగు వారు సుదర్శన్ రెడ్డి గెలుపుకు నిలబడాలి!



హైదరాబాద్,ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలు ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చని.. తెలుగు వారు అందరూ ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారి గెలుపుకు నిలబడాలిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మాజీ సీఎం వైఎస్ జగన్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే అసదుద్దీన్.. ఆయన గెలుపుకు కృషి చేయాలని వ్యక్తిగతంగా కోరుతున్నానన్నారు. సుదర్శన్ రెడ్డి గెలుపు వల్ల మన తెలుగువారి ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఈరోజు హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో సుదర్శన్ రెడ్డితో తెలంగాణ రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'మన తెలుగు వారు అందరూ సుదర్శన్ రెడ్డి గారిని అభినందించాలి. మనం అందరం ఆయన గెలుపుకోసం నిర్ణయం తీసుకోవాలి. తెలుగు వారి ఉనికికి ప్రమాదంలో ఉన్న నేపథ్యంలో సుదర్శన్ రెడ్డి గారు ఈ ఎన్నికలో బరిలోకి రావడం జరిగింది. ఎన్డీయే కూటమికి బలమైన ఛాలెంజ్ ను విసరడం జరిగింది. రాజ్యాంగాన్ని సంరక్షించాలి. ఉపరాష్ట్రపతిగా ఉన్న వ్యక్తి రాజీనామా అందరినీ ఆశ్చర్య పరిచింది. రాజ్యాంగాన్ని కాపాడాలి, రిజర్వేషన్లను కాపాడాలి. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలు, ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. తెలుగు వారు అందరూ సుదర్శన్ రెడ్డి గారి గెలుపుకు నిలబడాలి. ప్రతి ఒక్కరు ఆయన గెలుపుకు కృషి చేయాలని వ్యక్తిగతంగా కోరుతున్నాం' అని అన్నారు.'సుదర్శన్ రెడ్డి గారి గెలుపు వల్ల మన తెలుగువారి ప్రతిష్ఠ పెరుగుతుంది. ఓట్ల చోరీతో ఎన్నికల్లో నెగ్గాలని బీజేపీ చూస్తోంది. ఇలాంటి సమయంలో పెద్దల సభ సజావుగా సాగాలంటే.. ప్రజాస్వామ్యం భద్రంగా ఉండాలంటే.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు సరైన వ్యక్తి. ఒక న్యాయమూర్తిగా, లౌకిక వాదిగా, పేదల పక్షపాతిగా.. అన్నివిధాల సుదర్శన్ రెడ్డి సరైన వ్యక్తిగా ఉన్నారు' అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్ సహా కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తాజ్ కృష్ణలో సుదర్శన్ రెడ్డితో భేటీ అయ్యారు.

# కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారు..

హైదరాబాద్,కాళేశ్వరాన్ని కామధేనువుగా మార్చుకున్నారనే తమ మాట నిజం అయ్యిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ అగ్ర నేతలు కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారని..ఏఈ, ఎస్ఈ ల వద్ద కోట్ల రూపాయలు దొరకడం అంటే ఏమిటి? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం అన్ని వర్గాల, పక్షాల సూచనల మేరకు గొప్ప నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకున్నారని ప్రశంసించారు. కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించడం అనేది గొప్ప నిర్ణయం అని కొమియాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ%౫% 'నిన్న అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం అన్ని వర్గాల, పక్షాల సూచనల మేరకు గొప్ప నిర్ణయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్నారు. సీబీఐకి కాళేశ్వరం అంశాన్ని అప్పగించడం అనేది గొప్ప నిర్ణయం. ఎలాంటి పక్షపాతం లేకుండా సీబీఐకి అప్పగించడం అంటే పారదర్శకంగా ఉన్నామని సందేశం ఇవ్వడం. గతంలో సీబీఐకి అప్పగించాలని బీజేపీ సూచించింది. కాళేశ్వరాన్ని కామధేనువుగా మార్చుకున్నారనే మా మాట నిజం అయ్యింది. బీఆర్ఎస్ అగ్ర నేతలు కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారు. ఏఈ, ఎస్ఈ ల వద్ద కోట్ల రూపాయల దొరకడం అంటే ఏమిటి?. మాజీ మంత్రులు నిన్న హరీష్ రావు, కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ సభ్యులు బాడీ లాంగ్వేజ్ ఏ విధంగా ఉందో అందరూ చూశారు. బీజేపీ ఐడియాలజీని మా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ విమర్శిస్తుంది. ఈ రెండు పార్టీలు విరుద్ధ భావజాలం కలిగినవి.. ఎప్పుడూ కలవలేదు' అని అన్నారు.'గతంలోనే మా ప్రభుత్వం అధికారంలోకి



వస్తే కాళేశ్వరంపై విచారణ చేస్తామని చెప్పాం. కేంద్ర సంస్థగా ఉన్న సీబీఐకి అప్పగించాం. తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్న సంస్థలకు ఇస్తే.. కక్ష సాధింపు చర్యలకు పాల్పడతారని ఆరోపిస్తారు. అందుకే కేంద్ర సంస్థకు అప్పగించడం జరిగింది. సీబీఐని గతంలో ఆయా అంశాలపై విమర్శించాం. కానీ కాళేశ్వరం అంశం ప్రత్యేక అంశంగా పరిగణించడం జరిగింది. మేము విమర్శలకు తావు లేకుండా కేంద్ర దర్యాప్తు సంస్థకి అప్పగించాం. పారదర్శకంగా ఈ విచారణ జరగాలి. రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం. గతంలో అమిత్ షా, మోడీలు కూడా కాళేశ్వరాన్ని అడ్డు పెట్టుకుని కేసీఆర్ సంపాదించారని అన్నారు. కేసీఆర్ కుట్ర కోణంతో ఇదంతా చేశారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఈ కుంభకోణాన్ని వెలికి తీసేందుకు ఈ విచారణ జరుగుతుందని నమ్ముతున్నాం' అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# రేవంత్.. కొండను తవ్వి ఎలుకను పట్టారా?: లక్ష్మణ్ సెటైర్లు



హైదరాబాద్: తెలంగాణలో బీసీ బిల్లుపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు బీజేపీ రాజ్యసభ ఎంపీ డా. లక్ష్మణ్. ఇదే సమయంలో కొండను తవ్వి ఎలుకను పట్టిన విధంగా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం రుజువులు మాయం చేసేందుకు పీసీ ఘోష్ కమిషన్ వేశారా? అని ప్రశ్నించారు. విధిలేని పరిస్థితిల్లో సీబీఐకి అప్పగించారు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ.. కొండను తవ్వి ఎలుకను పట్టిన విధంగా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. విధిలేని పరిస్థితిల్లో సీబీఐకి అప్పగించారు. కాళేశ్వరం అవినీతి రుజువులన్నీ సీబీఐకి అప్పగించాలి. 22 నెలల తర్వాత రేవంత్‌కు కనువిప్పు కలిగింది. ఆరు నెలల్లో నిగ్గు తేల్చుతామని అన్నవారు ఎందుకు కాలయాపన చేశారు. కాళేశ్వరం రుజువులు మాయం చేసేందుకు పీసీ ఘోష్ కమిషన్ వేశారా?. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు. ముస్లింలను బీసీల్లో ఎలా చేరుస్తారు?. బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే ఉంది. నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ నేతలు బీసీలను మోసం చేశారు. కాలయాపన కొరకే ఘోష్ కమిషన్ ఏర్పాటు చేశారు.సీబీఐకి అన్ని ఆధారాలు ఇవ్వాలి. లేదంటే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. ప్రజలకు ఉన్న అనుమానాలు నివృతి చేయాలి. కాంగ్రెస్ బీసీ బిల్లుపై మొదటి నుంచి ద్వంద్వ వైఖరి పాటిస్తుంది. ఒక్కసారేమో ఆర్డినెన్సు అన్నారు. ఇంకోసారి ఢిల్లీ వెళ్ళి ముఖ్యమంత్రి ధర్నా చేశారు. అసలు న్యాయపరమైన చిక్కులకు మీరు తీసుకున్న చర్యలు ఏంటి?. నెపంతో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుంటే ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారు. బీసీల కొరకు సర్వే చేశారా? ముస్లిం కొరకు సర్వే చేశారా?. బీసీలను మోసం చేయడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉంది. బిల్లు పెట్టడమే కాదు బిల్లు పాస్ అయ్యేలా సీఎం రేవంత్ పూర్తి బాధ్యత తీసుకోవాలి. బీజేపీ బీసీల 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉంది' అని చెప్పుకొచ్చారు.

# పీవీ ఘోష్ రిపోర్ట్ కాదు.. అది పీసీసీ రిపోర్ట్..

తిమ్మాపూర్, సెప్టెంబర్ 1 : పీవీ గోష్ రిపోర్టు న్యాయబద్ధమైనది కాదని.. అది పీసీసీ రిపోర్ట్ అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు కండ్లకు కనిపించలేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వారు ఎల్ఎండీ కాలనీలో గల అమరవీరుల స్థూపాన్ని కాళేశ్వరం జలాలతో సోమవారం శుద్ధీకరణ చేశారు.స్వయంగా ఎల్ఎండీ జలాశయంలోకి నాయకులతో కలిసి దిగి బిందెల్లో నీళ్లను తెచ్చి శుద్ధి చేశారు. అనంతరం పీవీ ఘోష్ రిపోర్ట్ ను పెట్రోల్ పోసి కాల్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు మీద, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత కేసీఆర్ మీద ఇష్టం వచ్చినట్టు రిపోర్ట్ ఇస్తే ఊరుకోబోమన్నారు. అది పక్కా ప్రణాళికతో పీసీసీ ప్రదర్శన రాసుకున్న రిపోర్ట్ అని. రాష్ట్రంలో వరదలతో అతలాకుతలం అయి ప్రభుత్వం మీద తీవ్ర వ్యతిరేకతలు రావడంతో ఆగమేఘాల మీద రెండు రోజులు అసెంబ్లీ పెట్టి బీఆర్ఎస్ పార్టీ బద్నాం చేసేందుకే, తెలంగాణ కళల ప్రాజెక్టు కాళేశ్వరం కీర్తిని త్యజించేందుకే అన్నట్లు వ్యవహరించారని.



రైతులకు సరిపడా యూరియాను తేలేని దద్దమ్మ ప్రభుత్వం కాళేశ్వరం గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి,ఉల్లెంగుల ఏకానందం, సిద్ధం వేణు, శేఖర్ గౌడ్,పాశం అశోక్ రెడ్డి,నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

# సీబీఐకి కాళేశ్వరం అప్పగించడం అంటే ప్రాజెక్టును మూసివేయడమే

హైదరాబాద్: సీబీఐకి కాళేశ్వరం అప్పగించడం అంటే ప్రాజెక్టును మూసివేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసివేసి గోదావరి నదీ జలాలను ఆంధ్రకు తరలించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటామని, తమకు కేసులు కొత్తేమీ కాదని చెప్పారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పార్టీ శ్రేణులతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తుందన్నారు. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసివేసి గోదావరి నదీ జలాలను ఆంధ్రకు తరలించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరంపై బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేస్తున్న కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. ఇది కేసీఆర్‌పై చేస్తున్న కుట్ర మాత్రమే కాదని, కాళేశ్వరాన్ని ఎండబెట్టి పక్క రాష్ట్రాలకు తరలించే కుట్ర అన్నారు.సీబీఐకి కాళేశ్వరం అప్పగించడం అంటేనే ప్రాజెక్టును మూసివేయడమేనని చెప్పారు. నిన్నటిదాకా సీబీఐకి వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్ ఒక్క రోజులోనే మాట మార్చారని మండిపడ్డారు. దీని వెనుక ఉన్న శక్తులు, వాటి ఉద్దేశాలు ఏమిటో ప్రజలకు తెలియాలన్నారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్, బీజేపీ ఆడుతున్న కుట్ర, కపట నాటకమని ధ్వజమెత్తారు. సీబీఐకి గానీ, ఏ ఏజెన్సీకి ఇచ్చినా భయపడేది లేదని స్పష్టం చేశారు. కేంద్రంతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటామన్నారు. కేసులు తమకు కొత్తేమీ కాదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని త్యాగాలైనా చేస్తామన్నారు.

మిస్టర్ గాంధీ.. మీ సీఎం ఏం చేస్తున్నారో మీకు తెలుసా?: కేటీఆర్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్ సీబీఐ విచారణకు



ఆదేశించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిస్టర్ గాంధీ.. మీ సీఎం ఏం చేస్తున్నారో మీకు తెలుసా అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. సీబీఐని ఉద్దేశించి రాహుల్ గాంధీ గతంలో చేసిన వ్యాఖ్యలను పేర్కొంటూ ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'కాళేశ్వరంను సీబీఐకి అప్పగించాలని తెలంగాణలో రాహుల్ గాంధీకి కరెన్సీ మేనేజర్ నిర్ణయం తీసుకున్నారు. విపక్ష పార్టీలను నాశనం చేసే సెల్‌గా సీబీఐని గతంలో రాహుల్ గాంధీ అభివర్ణించారు. మిస్టర్ గాంధీ.. మీ సీఎం ఏం చేస్తున్నారో మీకు తెలుసా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తమపై ఎన్ని కుట్రలు చేసినా.. రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. న్యాయయ వ్యవస్థ, ప్రజలపై తమకు నమ్మకం ఉంది. సత్యమేవ జయతే' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.గతంలో దర్యాప్తు సంస్థలను బీజేపీ ప్రభావితం చేస్తోందని చేసిన ట్వీట్ తాలుకా స్క్రీన్ షాట్‌ను కూడా కేటీఆర్ తన ట్వీట్‌లో పోస్ట్ చేశారు. 'సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలు ఇప్పుడు బీజేపీకి విపక్ష పార్టీలను నాశనం చేసే సెల్‌గా మారిపోయాయి. తద్వారా ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తున్నదంటూ రాహుల్ గతంలో వ్యాఖ్యానించారు.

# ఆ ఒక్క కారణంగానే.. ఉపరాష్ట్ర పతి ఎన్నికల్లో పోటీ చేస్తున్నా!



న్యూఢిల్లీ,తాను ఇండియా కూటమి అభ్యర్థిని కాదని, ప్రతిపక్షాల అభ్యర్థిని అని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడటం కోసమే ఉపరాష్ట్ర పతి ఎన్నికల్లో పోటీ చేస్తున్నా అని స్పష్టం చేశారు.రాజకీయం అనే ముళ్ల కిరీటాన్ని ఎందుకు నెత్తిన పెట్టుకున్నారని చాలా మంది తనను అడిగారని చెప్పారు. తాను రాజకీయాల్లో ప్రవేశించలేదని, ఏ పార్టీలో సభ్యత్వం లేదని, ఇక ముందు కూడా ఉండదని పేర్కొన్నారు. పౌరహక్కులు, సామాజిక న్యాయం గురించి మాట్లాడుతా అని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈరోజు హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో సీఎం రేవంత్ రెడ్డితో సుదర్శన్ రెడ్డి భేటీ అయ్యారు.'ఇదొక అపూర్వైన, అనిర్వచనీయమైన అనుభూతి. ఇంతపెద్ద బాధ్యత నేను మోయగలుగుతానా?, సఫలీకృతున్ని అవుతే అనే ఆలోచనలు వచ్చాయి. నా ప్రత్యర్థి కనబడరు, ఎక్కడున్నారు తెలియదు. అభ్యర్థులు ఇద్దరు మాట్లాడితే సంభాషణ ఉంటే తెలుస్తుంది. నన్ను కొంతమంది మీడియా మిత్రులు అడిగారు, ఎందుకు ఈ ముల్లకిరీటం పైకి వస్తున్నారు అని. నేను ఒకటే చెప్పాను.. 53 ఏళ్లుగా భారత రాజ్యాంగతో నా ప్రయాణం సాగుతోంది. అది ప్రమాదంలో పడింది.. దాన్ని కాపాడటమే నా ధ్యేయం. రాజ్యాంగానికి నిబద్ధతతో ఉంటాను.. నిబద్దుడిగా ఉండటమే కాదు కాపాడుతాను. నా ప్రయాణానికి బ్రేక్ ఇవ్వలేదు. నేను ఏ పార్టీలో చేరలేదు. రాజ్యాంగ పరంగా ఓటు వేసే ప్రతి పౌరుడు రాజకీయాల్లో ఉంటారు. పౌర సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నేను మాట్లాడుతాను. పౌరహక్కులు, సామాజిక న్యాయం, ఆదేశిక సూత్రాలు గురించి మాట్లాడుతాను. నన్ను ఫలానా వ్యక్తి, నేను ఫలానా అని అంటున్నారు. వనరుల సంపద ఎవరి చేతిలో కేంద్రీకృతం అవ్వకూడదు. స్త్రీ పురుషులు సమానత్వం.. అని ఆదేశిక సూత్రాలు చెబుతాయి. నేను వాటిని నమ్ముతాను' అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి చెప్పారు.'నేను ఎన్ని సవాళ్లు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాను. రాజ్యాంగం మసకబారుతోంది. నావంతు కాదు.. ప్రతి పౌరులు గొంతెత్తి మాట్లాడాల్సిన సందర్భం. నేను కేవలం ఇండియా కూటమి అభ్యర్థిని మాత్రమే కాదు.. నేను ప్రతిపక్షాల అభ్యర్థిని. నేను ఇండియా కూటమిలో భాగస్వామ్యం కాలేదు కానీ.. నా అభ్యర్థిత్వానికి గురించి అడిగినప్పుడు నేను రాజ్యాంగం కాపాడాలంటే పోటీ చెయ్యాలి అనుకున్నాను. SIR□ అని కొత్త వ్యవస్థ వచ్చింది. ప్రపంచ ఖ్యాతి గడించిన కృష్ణ అయ్యర్.. రిజర్వాయర్ ఆఫ్ పవర్ అన్నారు. ఈ దేశంలో ప్రజలు పౌరులు అయ్యాక ఓటర్లు అయ్యారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడకపోతే.. ఓటర్ లిస్టులు మారుస్తారు. బిహార్లో జరుగుతున్న పోరాటం ప్రతిపక్షాలకు, అధికారపక్షానికి మధ్య జరుగుతుంది కాదు' అని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

# సుప్రీంకోర్ట్ సంచలన తీర్పు.. నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే లోకల్..



ఢిల్లీ: తెలంగాణలో లోకల్ కోటా కింద ఉన్నత విద్య అభ్యసించాలని అనుకుంటున్నారా అయితే ఒక్క క్షణం ఆగండి. స్థానికత అంశంపై సుప్రీంకోర్ట్ సంచలన తీర్పునిచ్చింది.తెలంగాణలో వరుసగా 9 ,10, 11,12 తరగతులు చదువితేనే లోకల్ అంటూ స్పష్టం చేసింది. అయితే ఈ రూల్స్ లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఉంటుందనే షరతు పెట్టింది సుప్రీం కోర్ట్. లోకల్ రిజర్వేషన్ అంశంపై తెలంగాణకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. వరుసగా నాలుగేళ్లు అంటే 9వ, 10వ, 11వ, 12వ తరగతులు తెలంగాణలో చదివితేనే స్థానికుడిగా పరిగణించాలని స్పష్టంచేసింది. అయితే, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. స్థానికత అంశంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 33కి అత్యున్నత న్యాయస్థానం పూర్తి స్థాయి మద్దతు తెలిపింది.తెలంగాణలో స్థానిక రిజర్వేషన్ల అంశం ఎప్పటి నుంచో వివాదాస్పదంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 33 ప్రకారం ఇంటర్మీడియట్‌కు ముందు వరుసగా నాలుగేళు చదివిన విద్యార్థులనే స్థానికులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. కానీ, కొందరు విద్యార్థులు దీన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రతి రాష్ట్రం తన స్థానిక రిజర్వేషన్ల కోసం తగిన నిబంధనలు రూపొందించుకునే అధికారం ఉందని సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్రం వాదనలు వినిపించింది.అయితే రాష్ట్ర విభజన తర్వాత తమ పిల్లలు మరో రాష్ట్రంలో చదవాల్సి వచ్చిందని అభ్యర్థుల తరపున వాదనలు వినిపించారు పిటిషనర్లు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో లోకల్ కోటా పై జీవో 33 ను అమలు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు తప్పని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్నారని..దాంతో వాళ్ళ పిల్లలకు జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. రాష్ట్రప్రభుత్వం చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు వెల్లడించింది.అయితే గతేడాది హైకోర్ట్ ఇచ్చిన తాత్కాలిక మినహాయింపుతో స్థానిక కోటా కింద ప్రయోజనం పొందిన విద్యార్థులు తమ ప్రయోజనాలను కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఎంబీబీఎస్, బీడీఎస్ యూజీ కోర్సులలో జీవో 33 ప్రకారమే స్థానిక కోటా రిజర్వేషన్లు అమలుకానున్నాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామనడంపై ప్రైవేటు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా తప్పని పరిస్థితుల్లోనే రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని తమ పిల్లల భవిష్యత్ గురించి ప్రభుత్వము కోర్టులు ఆలోచించాలని వేడుకుంటున్నారు.

## ఎగిలి వారక ముందే యూరియా కోసం రైతుల బారులు

హుజూరాబాద్, సెప్టెంబర్ 1: యూరియా కష్టాలు ఇప్పట్లో తీరే విధంగా కనబడలేదు. ఒక బస్తా కోసం రైతులు పొద్దంతా పడిగాపులు కాయాల్సి వస్తుంది. ఎగిలి వారక ముందే యూరియా కోసం దుకాణాల వద్ద బారులు తీరాల్సిన దుస్థితి నెలకొంది. పట్టణంలో వరలక్ష్మీ ఫర్టిలైజర్ దుకాణానికి యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు వేకువ జాముననే వచ్చి క్యూ కట్టారు. 9గంటల వరకు కూడా షాప్ యజమాని టోకెన్లు ఇవ్వలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు టోకెన్లు జారీ చేసి బస్తాలు ఇవ్వడంతో రైతులు వెళ్లిపోయారు.


**సంపాదకీయం**

**మంగళవారం 02-09-2025**

# ప్రకృతి విధ్వంసానికి పరాకాష్ట !

ప్రకృతి విధ్వంసంపై ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు. మన చేజేతులా ప్రకృతిని నాశనం చేస్తున్నాం. ఫలితం అనుభవిస్తున్నాం. మనం జీవించి ఉండగానే ఎన్నో విపత్తులను చూస్తున్నాం. ఎక్కడికక్కడ చెరువుల విధ్వంసం, ఆక్రమణలతో ఇప్పుడు ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరుతోంది.ఎందుకిలా జరిగిందో,జరుగుతుందో ఆలోచించడం లేదు. ఇల్లువాకిలి, పొలంగట్రా నీట మునిగాక ప్రభుత్వాలను నిందిస్తూ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ప్రతి గ్రామంలో వందల ఏళ్ల క్రిం ఉన్న చెరువులను గుట్టలను, వాగులను వంకలను మాయం చేస్తున్నాం. మనకు లాభం జరిగిందా లేదా అన్న కోణంలోనే ఆలోచన చేస్తున్నాం. అదుకే ప్రకృతి ప్రకోపించి మన ఇళ్లనే మనముందే ముంచేస్తోంది. అందుకు తాజా వర్షాలే నిదర్శనం. చెరువులు, వంకలు, వాగులు అలాగే ఉండిపుంటే వచ్చిన నీరు వచ్చినట్లు మళ్లీ పోయేది. దానికి దారిలేకుండా చేసిన పాపానికి మనం ఫలితం అనుభవించి చాల్సిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్రు జలప్రళయంతో విలవిల్లాడుతున్నాయి. నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వరదలకు ప్రకృతి విధ్వంసం కారణమని గుర్తించాలి. ఇకపోతే క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి కురుస్తోంది.ఉత్తరాదిలోని ఉత్తరాఖండ్ లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కుంభవృష్టి అనేక గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి క్లౌడ్‌బర్స్ట్ సభవించింది. అనేక చోట్ల ఇళ్లకూలి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో అనేక జిల్లాలకు సంబంధాలు తెగిపోయాయి. జమ్మూకశ్మీర్‌లో ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీనగర్, అనంత్‌నాగ్‌ల్లో నదులు ప్రమాదస్థాయిని మించి ఉప్పొంగడంతో, గండ్లుపడి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంజాబ్‌లో గ్రామాలన్నీ జలదిగ్బం ధంలో చిక్కుకున్నాయి. వ్యవసాయ భూములు అదృశ్యమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో కూడా భారీ వర్షపాతం నమోదైంది. యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నైరుతి పవనాల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఈ ఆగస్టులో ఎప్పుడూ లేనంతగా క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ వర్షాలు ప్రారంభమయ్యాయి. హిమాలయ పర్వత వాలు ప్రాంతాలు ఒరిగిపోయాయి. మైదానప్రాంతాల్లో గట్లు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటపొలాలు నీట మునిగాయి. రైతన్నలు పూర్తిగా రోడ్డున పడ్డారు. తక్కువ సమయాల్లో ఎడతెరిపిలేని కుంభవృష్టి స్థానిక నేలకోతను పెంచుతుంది. కొండచరియలు విరిగిపడి సమీప నివాసాలను ధ్వంసం చేస్తున్నాయి. ఊళ్లకు ఊళ్లే కొట్టుకు పోతున్నాయి. పదుల సంఖ్యలో జనం మృత్యువాత పడుతున్నారు. ఇఇలా ఎందుకు జరుగుతుందో ప్రజలు ఆలోచించాలి. ప్రభుత్వాలు చర్చించాలి. కార్యాచరణకు దిగాలి. ప్రకృతి వైపరీత్యాల నుంచి అనుభవాలు నేర్చుకోవడం లేదు. మనం చేస్తున్న విధ్వంసం గురించి మాట్లాడకుండా, వాటిని విస్మరించి ప్రకృతి విపత్తును అసాధారణమైనదిగా చర్చిస్తున్నాం. కొండచరియలు విరిగి పడడానికి కూడా మనం చెట్లను తొలగించడం, బండలను పగుల గొట్టడం అని తెలుసుకోవడం లేదు. దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్‌లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో గుర్తించింది.రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఎలాంటి ప్రణాళిక లేకుండా సాగించే కొండ క్వారీ పనుల కారణంగా కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని హెచ్చరించింది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఇష్టం వచ్చినట్లుగా చెట్లను కూల్చివేశారు. దీంతో కొండలపై ఉన్న సారవంతమైన మట్టి వర్షాలకు కొట్టుకుపోయి, కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతోపాటు- పంట పొలాల్లోకి, ఇళ్లలోకి బురద ప్రవాహంలా వచ్చిచేరుతోంది. ఎన్నో ప్రాణాలు జలసమాధి అవుతున్నాయి. ఇవన్నీ స్వయం కృతాపరాధాలే. పర్యావరణ సున్నితమైన హిమాలయ రాష్ట్రాల్లో కొండవాలు ప్రాంతాలు అత్యంత బలహీనమైనవని, వాటిని తిరిగి పొందలేనివని పర్యావరణ శాస్త్రవేత్తలు ఎన్నో హెచ్చరికలు చేసినా పెడచెవిన పెడుతున్నాం. ప్రజలు, ప్రభుత్వాలు చేస్తున్న విధ్వంసంగా దీనిని గుర్తించాలి. ప్రభుత్వాలు ఈ విధ్వంసాన్ని అడ్డుకోవడం లేదు. అలాగని ప్రజలు కూడా తమ వైఖరి మార్చుకోవడం లేదు. అంతెందుకు మనదగ్గర పోడు వ్యవసాయంతో అడవులను నరికివేస్తున్నాం. దీనిని అడ్డుకుని అడవులను పెంచాల్సిన బాధ్యతలను విస్మరించి, పోడు రైతులను ప్రోత్సహిస్తున్నాం. భారీ వర్షాల కారణంగా భూమి కోతకు గురికావడంతో ఆనకట్టల్లో పూడిక పేరుకుపోతోంది. వరదలతో దిగువ ప్రవాహాలు పెరుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు అదే పనిగా సంభవిస్తున్నాయనడానికి ఇదంతా మానవ తప్పిదమని గుర్తించడం లేదు. అవసరాల కోసం అడవులను నరికివేస్తున్నారు. కొండవాలు ప్రాంతాలను తొలగించడం, పరీవాహక ప్రాంతం కుదించుకుపోవడం, జనాభా పెరిగిపోతుండడం వీటన్నిటి ఫలితం ఎంతటి విధ్వంసాన్ని కలిగిస్తుందో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈఅనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఒక ప్రణాళికతో ప్రకృతి విధ్వంసాన్ని ఆపితే..కొంతయినా తగ్గించు కోవడం సాధ్యం కాగలదు. తరచుగా సంభవిస్తున్న ఈ విపత్తుల నివారణకు ముందస్తు ప్రణాళికలు ఆలోచించడం లేదు. ఇప్పటికీ సమయం మించిపోలేదు. దీనికంతటికీ కారణమైన పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. చెట్లను నరకడం, గుట్టలను పిండిచేయడం, కొండవాలు ప్రాంతాలను ధ్వంసం చేసేయడం, అడవులను నరకడం తక్షణం ఆపాలి. కాలువలు, చెరువులను పునరుద్ధరించాలి. అలాగే జనాభా నియంత్రణ కూడా జరగాలి. ఇదంతా పెరుగుతున్న జనాభా వల్ల కూడా జరుగుతోందని మనిషి తన మనుగడ కోసం ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాడని గుర్తించి కఠిన నివారణ చర్యలకు పూనుకోవాలి. అప్పుడే ఈ విధ్వంసం కొంతయినా ఆపగలం.

# మోహన్ భగవత్ వ్యాఖ్యల వెనుక ఆంతర్యమేంటి..?



న్యూఢిల్లీ, బీజేపీ సైద్ధాంతిక మూలాలు ఆరెస్సెస్ లో ఉన్నాయనే మాటను ఎవరూ కాదనలేరు. అలాగే ఆరెస్సెస్ కూడా బీజేపీని కంట్రోల్ చేస్తున్న విషయం కూడా తెలిసిందే. మోడీ రాకముందు వరకు పూర్తిస్థాయిలో ఆరెస్సెస్ కనుసన్నల్లో నడిచిన బీజేపీ.. తర్వాత కాస్త స్వతంత్రించినా.. మళ్లీ ఇటీవలి కాలంలో ఆరెస్సెస్ సలహాలు తీసుకుంటోంది. ఆరెస్సెస్ ప్రధాన లక్ష్యం భారతీయ సంస్కృతి పరిరక్షణే అయినా.. అందుకోసం దేశంలో వివిధ వర్గాల్లో తన భావజాలాన్ని చొప్పించే పని చేస్తూనే ఉంటుంది. ప్రజాస్వామ్య భారతంలో తమ భావజాల వ్యాప్తికి రాజకీయ పార్టీ అవసరమనే ఉద్దేశంతోనే జన్ సంఘ్ కు ఊపిరి పోసింది. ఆ తర్వాత జన్ సంఘే బీజేపీగా రూపు మార్చుకుంది. ఇటు బీజేపీ కూడా రాజకీయంగా ఎన్ని ఢక్కామొక్కీలు తిన్నా.. ఆరెస్సెస్ అజెండా విషయంలో రాజీ లేకుండా చూసుకుంటుంది. కాలం కలిసి రాకపోతే సైలెంట్ గా ఉంటుంది తప్ప.. ఆరెస్సెస్ అజెండాకు భిన్నంగా వెళ్లే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు. చేయదు కూడా.రాజకీయంగా బీజేపీ విజయాల్ని చూసి ఆరెస్సెస్ సంతోషించే మాట వాస్తవం. వీలైనంత వరకు పార్టీ సొంతంగా నిర్ణయాలు తీసుకోవాలనే విధానం కూడా కొంతవరకూ నిజమే. కానీ బీజేపీకి కాస్త స్వేచ్ఛ ఇచ్చినప్పుడల్లా.. మూలాలు మరిచిపోయి.. సంఘ్ సిద్ధాంతాలతో సంబంధం లేని నేతల్ని పార్టీలో చేర్చుకోవడం, వారి ప్రాధాన్యత పెరగటం ఆరెస్సెస్ ను అసంతృప్తికి గురిచేసేది. అందుకే ఎప్పటికప్పుడు బీజేపీలో జరిగే వ్యవహారాలపై ఆరెస్సెస్ నిరంతర పరిశీలన ఉంటుంది. అలాగే అవసరమైనప్పుడు సలహాలు కూడా ఇస్తుంది. చివరకు బీజేపీ పూర్తిగా ఆరెస్సెస్ కనుసన్నల్లో నడిచినప్పుడు కూడా సంఘ్.. తన సలహాలకు అనుగుణంగా పార్టీయే నిర్ణయాలు తీసుకోవాలని సూచించేది. అంతే కానీ ప్రత్యక్షంగా జోక్యానికి ఎక్కువగా ఇష్టపడేది కాదు. అసలు బీజేపీ, ఆరెస్సెస్ లింక్ గురించి ఎక్కువ మాట్లాడటానికి కూడా మొదట్లో ఇష్టపడేవారు కాదు. తాము ఏ ఉద్దేశంతో రాజకీయ పార్టీ పెట్టామో.. అది నెరవేరటమే ప్రధానం కానీ.. తమ పెత్తనం కాదనే దృష్టి కూడా ఉండేది. కానీ కాలక్రమంలో ఆ లక్ష్యసాధనకు దూరం జరిగేలా బీజేపీలో పరిణామాలు జరిగినప్పుడు మాత్రం ఆరెస్సెస్ పరోక్ష జోక్యం ఉండేది. ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో పార్టీ నాయకత్వానికి సూచనలు అందేవి. అందుకే ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఇప్పుడు చెప్పిన దాంట్లో కొత్త విషయం ఏం లేదని కాషాయ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆరెస్సెస్, బీజేపీ సంబంధాన్ని సరిగ్గా అర్థం చేసుకోనివారే.. బీజేపీపై ఆరెస్సెస్ పెత్తనం చేస్తుందని భావిస్తారని అంటున్నాయి.ఆరెస్సెస్ ఒక్క బీజేపీ విషయంలోనే కాదు.. తాను సృష్టించిన ఇతర సంస్థల విషయంలోనూ ఇదే వైఖరితో ఉంటుంది. ప్రతి విభాగం స్వతంత్రంగా పనిచేయాలి. అదే సమయంలో మూలసూత్రాలకు దూరం జరగకూడదు. ఇది ఒక్కటే ఆరెస్సెస్ షరతు. మొదట్లో బీజేపీ సమావేశాలకు ఆరెస్సెస్ ప్రతినిధులు కూడా హాజరయ్యేవారు. పరిస్థితులు గమనించేవరు. ఇప్పటికీ జాతీయ స్థాయిలో పార్టీలో ఆరెస్సెస్ నుంచి ఒక అబ్జర్వర్ ఉన్నారు. బీజేపీ రాజకీయ లక్ష్యాలకు, సంఘ్ మూలసూత్రాలకు సంఘర్షణ తలెత్తకుండా చూసుకోవటమే వీరి పని. ఈ ప్రయత్నం ఎక్కడైనా విఫలమైతే.. అప్పుడు నాగ్ పూర్ నుంచి పిలుపులు వస్తాయి. అగ్ర నాయకత్వానికి సలహాలు అందుతాయి. ఆ సలహాల అమలుకు కొంత కాలపరిమితి ఉంటుంది. అప్పటికే మార్పు రాకపోతే.. ఆరెస్సెస్ నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి రావచ్చు. అప్పుడు తప్పనిసరిగా ఆ సలహాలు పాటించక బీజేపీకి తప్పని స్థితి ఉంటుంది.ఇక్కడ బీజేపీ తీసుకునే ప్రతి నిర్ణయానికి ముందు తాము సలహా ఇవ్వాలని కూడా ఆరెస్సెస్ అనుకోదు. మొదట బీజేపీకి స్వేచ్ఛ ఇచ్చి.. నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తోంది. కానీ ఆ స్వేచ్ఛ ఎక్కువై.. పరిధి దాటినప్పుడు మాత్రమే సలహాలిస్తుంది. ఈ విషయాన్నే మోహన్ భగవత్ స్పష్టంగా చెప్పారు. పైగా ఆరెస్సెస్ నిర్ణయాలు చేస్తే ఇంత సమయం పడుతుందా అనే వ్యాఖ్య కచ్చితంగా బీజేపీకి చురకే. జాతీయ పార్టీ అధ్యక్షుడ్ని ఎన్నుకోవటానికి ఇంత ఆలస్యం ఏంటని ఇప్పటికే రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. ఇప్పుడు మోహన్ భగవత్ చురకలు కూడా ఆ విమర్శల విషయంలో బీజేపీని అలర్ట్ చేయడమే అంటున్నారు.బీజేపీ కూడా వీలైనంతవరకు ఆరెస్సెస్ మనసెరిగి నడుచుకునే ప్రయత్నమే చేస్తుంది. కానీ కొన్నిసార్లు అనుకోకుండా పరిధి దాటాల్సి వస్తుంది. అదీ పరిధి దాటాకే ఆ విషయం తెలుస్తుంది. ఏ సమయంలో అయినా నాగ్ పూర్ నుంచి పిలుపు వచ్చిందంటే.. అక్కడకు వెళ్లే ముందే బీజేపీ నేతలు ఆత్మపరిశీలన చేసుకుంటారు. ఎక్కడ ఆరెస్సెస్ మనసు నొచ్చుకుని ఉంటుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. కొంత ప్రాథమిక కసరత్తు తర్వాతే ఆరెస్సెస్ ఆఫీస్ కు వెళ్తారు. అక్కడ ఏమైనా వివరణ అవసరమైతే ఇచ్చేసి.. అసలేం జరిగిందో చెప్పి.. మరోసారి అలా జరగకుండా చూసుకుంటామని నచ్చజెబుతారు.అవసరమైతే సమస్య పరిష్కారానిక కోఆర్డినేషన్ కమిటీ వేస్తారు. ఈ విషయం కూడా మోహన్ భగవత్ ప్రస్తావించారు. సమస్యలుంటే పరిష్కరించుకుంటామే కానీ.. తగాదా పడే ఉద్దేశం ఉండబోదని చెప్పారు.ఇక కార్యాచరణ పరంగా చూసుకుంటే బీజేపీ, ఆరెస్సెస్ మధ్య స్పష్టమైన తేడా ఉంటుంది. అందుకే లక్ష్యం ఒకటే అయినా దారులు వేరే అనే అర్థం వచ్చేలా మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ఇద్దరికీ లక్ష్యం విషయంలో స్పష్టత ఉంటుందని, ఏ దారిలో ప్రయాణించినా అంతిమంగా లక్ష్యం చేరటమే ప్రధానమనే అవగాహన ఉంటుందన్నారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బీజేపీ, ఆరెస్సెస్ రైలు పట్టాల్లా విడివిడిగా కనిపించినా.. రెండూ కలిసి తమ లక్ష్యాల రైలును ట్రాక్ తప్పకుండా చూసుకుంటాయనే అభిప్రాయాలున్నాయి. ఈ రెండు సంస్థల మధ్య లోతైన సమన్వయం లేకపోతే వందేళ్ల ఆరెస్సెస్, 45 ఏళ్ల బీజేపీ ప్రస్థానం ఇలా ఉండేవి కాదంటారు సంఘ్ అభిమానులు. అనుకున్న లక్ష్య సాధన కోసం ఓపికగా ఎదురుచూడటం.. క్రమం తప్పకుండా కార్యాచరణ సిద్ధం చేసుకోవటం.. వంటి లక్షణాలు రెండు సంస్థలకూ కామన్ గా ఉంటాయి. ఒక సంస్థకు అవసరమైనప్పుడు మరో సంస్థ అండగా నిలబడుతుంది. ఎవరికి ఎప్పుడు అడ్వాంటేజ్ వచ్చినా.. మరో సంస్థకు కూడా తోడ్పాటు ఇవ్వడం కనీస బాధ్యత అనే కట్టుబాటు నిర్విఘ్నంగా కొనసాగుతోంది. బీజేపీ రాజకీయంగా బలహీనప్పుడు ఆరెస్సెస్ సంస్థాగత బలం ఉపయోగిస్తుంది. మెల్లగా అధికారంలోకి రావటానికి బాటలు వేస్తుంది. అలాగే బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆరెస్సెస్ స్థితిగతులు చూసుకుంటుంది. ప్రభుత్వ పరంగా సంఘ్ కు ఏమైనా ఆటంకాలుంటే క్లియర్ చేసే ప్రయత్నం చేస్తుంది. అలా పరస్పర విశ్వాసం, సహకారంతో ఆరెస్సెస్, బీజేపీ మనుగడ సాగిస్తున్నాయి. మోహన్ భగవత్ సుదీర్ఘ ప్రెస్ మీట్ సారాంశం కూడా ఇదే.

# కేసీఆర్ పాత్రపై ఘోష్ కమిషన్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,కాళేశ్వరం అవకతవకలకు సంబంధించి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తగిన చర్యలు తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పేర్కొన్నది. కాళేశ్వరం అవకవకలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్ పూర్తి నివేదికను ఆదివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఎమ్మెల్యేలకు కాళేశ్వరం కమిషన్ నివేదికను పెన్ డ్రైవ్ రూపంలో అందించారు. ఈ నివేదికలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్రపై కమిషన్ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గత ముఖ్యమంత్రి సాంకేతికంగా, పాలనాపరంగా జోక్యం చేసుకోవడం వల్లే అవకతవకలు, చట్ట వ్యతిరేక నిర్ణయాలు చోటు చేసుకున్నాయని కమిషన్ అభిప్రాయపడింది. అందుకే అప్పటి ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాజకీయ కార్యనిర్వాహక స్థాయిలోనే జవాబుదారీతనాన్ని కూడా అక్కడే నిర్ధారించాలని పేర్కొన్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మూడు బరాజ్‌ల ప్రణాళిక, నిర్మాణాల్లో పూర్తిస్థాయిలో లోపాలు, తప్పిదాలు ఉన్నాయని కమిషన్ నివేదిక స్పష్టం చేసింది. అంచనాలు తయారు చేయడంతోపాటు పరిపాలన అనుమతుల్లోనూ లోపాలు ఉన్నాయని పేర్కొన్నది. ఈ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం అనుమతుల్లోనూ లోపాలు ఉన్నాయన్నది. డీపీఆర్ పూర్తిగా పరిశీలించకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలు ఆమోదించారని పీసీ ఘోష్ కమిషన్ అభిప్రాయపడింది. మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించరాదని నిపుణుల కమిటీ పేర్కొన్నా.. నాటి సీఎం కేసీఆర్ నిర్ణయం ప్రకారమే మేడిగడ్డతోపాటు, సుందిళ్ల, అన్నారం వద్ద బరాజ్‌లు నిర్మించారని తెలిపింది. వీటి నిర్మాణ కాంట్రాక్టుల విధానం కూడా సరిగా లేదని పేర్కొన్నది. డీపీఆర్‌ను పూర్తిగా పరిశీలించకుండానే అంచనాలు ఆమోదించారని తెలిపింది. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే అంచనాల పెంపు విషయంలో నిబంధనలను సడలించినట్టు కమిషన్ తేల్చి చెప్పింది. ఆర్థిక క్రమశిక్షణ లోపించడం, నిర్వహణ సరిగా లేని కారణంగానే మూడు బరాజ్‌లకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లిదని తెలిపింది. ఈ మూడు బరాజ్‌ల నిర్మాణం అతి పెద్ద పని అని కమిషన్ పేర్కొన్నది. దీనిని తెలంగాణ రాష్ట్రానికి జీవనాడిగా పేర్కొన్నారని తెలిపింది.అప్పటి ముఖ్యమంత్రి ప్రతి అంశాల్లో నిర్ణయాలు తీసుకున్నారని కమిషన్ నివేదిక స్పష్టం చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతలను రీఇంజినీరింగ్ చేసే పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆలోచన చేయడం మొదలుకుని, వ్యాప్కోస్‌కు నామినేషన్ పద్ధతిపై కన్సల్టెన్సీ సర్వీసులను అప్పగించడం, వ్యాప్కోస్ ఇచ్చే తుది డీపీఆర్ కోసం ఎదురుచూడకుండానే అంచనాల తయారీకి ఆదేశించడం, అంచనాలను ఆమోదించడం అదికూడా రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం లేకుండా%-% నీటిని నింపేందుకు ఆదేశాలు, కాంట్రాక్ట్ ఏజెన్సీలకు లబ్ధికలిగేలా కండిషన్ల సవరణకు ఆదేశాలు, ఇలా అన్ని అంశాల్లో ముఖ్యమంత్రి పాత్ర ఉందని తెలిసింది. ఆ సమయంలో ముఖ్యమంత్రి ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో ఇచ్చిన సూచనలు, తీసుకున్న నిర్ణయాల వల్లే ఈ మూడు బరాజ్‌లలో అక్రమాలు చోటు చేసుకుని, అన్ని సమస్యలకూ కారణమయ్యాయని పేర్కొంది.అప్పటి ఆర్థిక మంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి కమిషన్ ఎదుట హాజరైన సమయంలో ప్రభుత్వ విధానాన్ని అమలు చేసే బాధ్యత అధికారులదేనని చెప్పారని కమిషన్ పేర్కొన్నది. అది నిజమే కావచ్చని, కానీ.. ఈ కేసులో నీటి లభ్యత ప్రాతిపదికన అనే తప్పుడు కారణంతో బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని మేడిగడ్డకు మార్చడంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నారని తెలిపింది. ఈ విషయంలో నిపుణుల కమిటీ నివేదికను పక్కకు పెట్టి స్థల మార్పిడి జరిగిందని పేర్కొంది.ప్రారంభం నుంచి మొదలుకుని, బరాజ్‌ల ఆరోగ్యంతో నిమిత్తం లేకుండా వాటిలో నీటిని నింపి ప్రారంభించే వరకూ అన్నీ అప్పటి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే జరిగాయని తెలిపింది. అప్పటి ఆర్థిక మంత్రి మౌనంగా సహకరించగా, ఇరిగేషన్ మంత్రి అప్పటి ముఖ్యమంత్రి కోరిక నెరవేర్చేలా అనుమతించారని నివేదిక పేర్కొంది. నిజానికి.. అప్పటి సీఎం.. రాజకీయ కార్యనిర్వాహకుడిగానే కాకుండా.. పరిపాలన కార్యనిర్వాహకుడిగా కూడా వ్యవహరించి.. ప్రభుత్వ పాలసీని అముల చేశారని తెలిపింది. అవి రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం చేకూర్చాయని పేర్కొన్నది. కనుక అప్పటి ముఖ్యమంత్రిపై చట్టానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉన్నదని స్పష్టంచేసింది. ఈ అక్రమాలకు కారణమైన, రాష్ట్ర నిధుల పట్ల నమ్మకాన్ని వమ్ము చేసిన అధికారులు.. 'తప్పనిసరి పరిస్థితుల్లో మేం ఆ పని చేయాల్సి వచ్చింది' అని తమను తాము కాపాడుకునే ప్రయత్నానికి అర్హులు కాదని, వారికి ఎలాంటి మినహాయింపు ఇవ్వలేమని వ్యాఖ్యానించింది. ఇందుకు కారకులైన అధికారులు చట్ట ప్రకారం కఠినశిక్షకు గురికావాల్సిందేనని స్పష్టంచేసింది. భవిష్యత్తులో రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి తప్పుడు నిర్ణయాలు తీసుకుండా గుణపాఠంలా, ఒక హెచ్చరికగా ఆ చర్యలు ఉండాలని అభిప్రాయపడింది. వీరి విషయంలో మానవతా కారణాలు సహా ఎలాంటి సడలింపులు ఇచ్చినా అది రాష్ట్ర సంక్షేమానికి భవిష్యత్తులో విపత్తుగా మారే అవకాశం ఉంటుందని కమిషన్ నివేదిక హెచ్చరించింది.అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ నిర్వహణ సరిగా లేదని తెలిపింది. ఆనకట్టల డిజైన్లు, డ్రాయింగ్స్ లో పూర్తిగా లోపాలున్నాయని కమిషన్ ప్రకటించింది. క్వాలిటీ కంట్రోల్ సరిగా లేదన్నారు. మేడిగడ్డకు సబ్ స్టాన్షియల్ కంప్లీట్ సర్టిఫికెట్ ఇవ్వడం అక్రమమని,బ్యాంకు గ్యారెంటీల విడుదల కూడ తప్పేనని కమిషన్ అభిప్రాయపడింది. ఎలాంటి పెనాల్టీ విధించకుండా కాంట్రాక్టు పొడిగించారని, కాంట్రాక్టర్ల లబ్దికే నాటి ప్రభుత్వ నిర్ణయాలు నిర్ణయాలు తీసుకున్నారని కమిషన్ అభిప్రాయపడింది.అప్పటి ఈఎన్‌సీ మురళీధర్ రావు అన్ని అంశాలు తొక్కిపెట్టారని కమిషన్ వివరించింది. నిపుణుల కమిటీ నివేదికను అప్పటి ముఖ్య కార్యదర్శి ఎస్ కే జోషి తొక్కి పెట్టారని కమిషన్ తెలిపింది.

## తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల సదస్సు

అనకాపల్లి, తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల కోసం ప్రత్యేకంగా ఓ సమవేశాన్ని ఏర్పాటుచేస్తున్నామని, సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు- చేస్తున్నట్టు- ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మీడియాకు

# పవర్ పాయింట్ సంప్రదాయం ఎక్కడుంది?

హైదరాబాద్,ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. ప్రజలను ఎంతోకాలం తప్పుదోవ పట్టించలేరని అన్నారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాము పూర్తి ప్రజాస్వామికంగా వ్యవహరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు అందరికీ పూర్తిస్థాయిలో అవకాశం ఇస్తామన్నారు. తప్పులు చేసినవారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎందుకు అని భారత రాష్ట్ర సమితి నేతలను ప్రశ్నించారు. తెలంగాణలోనే కాదు.. దేశం మొత్తం యూరియా కొరత ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి ఒత్తిడి తెచ్చారన్నారు. తమ ఒత్తిడితోనే యూరియా కొంత సాధించినట్లు- వివరించారు. తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఆమె పార్టీ నేతలతో కలిసి గన్ పార్క్ వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తోందని వివరించారు. వరదలతో నష్టపోయిన వాళ్లను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అన్ని పార్టీలు ముందుకు రావాలి. కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదు. ఫామ్ హౌస్‌లో ఉండటంలో అర్థం ఏమిటి? అసెంబ్లీకి రాను.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్‌ను చెప్పమనండని విజయశాంతి అన్నారు.

# మరోమారు బంగారం, వెండి ధరల పెరుగుదల

న్యూఢిల్లీ, దాదాపు ఆగస్టు నెల చివరికి వచ్చినప్పటికీ బంగారం, వెండి రేట్లలో ర్యాలీ కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ, ట్రంప్ దూకుడు చర్యలతో పాటు- ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఇన్వెస్టర్లను ప్రభావితం చేస్తున్నాయి. దీనికి తోడు సెప్టెంబర్ ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఊహాగానాలు గోల్డ్ వంటి సేఫ్ హెవెన్ దిశగా పెట్టుబడిదారులు మారేలా చేస్తోందని రేట్ల పెరుగుదల గురించి బులియన్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 24 క్యారెట్ల బంగారం రేటు ఆగస్టు 29తో పోల్చితే 10 గ్రాములకు ఆగస్టు 30న రూ.1640 పెరిగింది. అంటే గ్రాముకు రేటు- రూ.164 పెరగటంతో కొనుగోలు దారులకు ధరలుచుక్కలు చూపిస్తున్నాయి. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు- ఆగస్టు 29తో పోల్చితే శనివారం అంటే ఆగస్టు 30న 10 గ్రాములకు రూ.150 పెరుగుదలను చూసింది. బంగారం రేట్లతో పాటు- మరోపక్క వెండి కూడా తమ ర్యాలీని వారాంతంలో కొనసాగిస్తోంది. ఆగస్టు 30న కేజీకి వెండి ఆగస్టు 29తో పోల్చితే రూ.11 వందలు పెరగటంతో తెలుగు రాష్ట్రాల్లో్ స్వచ్ఛమైన సిల్వర్ రేటు- కేజీకి రూ.లక్ష 31వేలకు చేరుకుంది. అంటే గ్రాము వెండి రేటు- రూ.131 వద్ద విక్రయాలు జరుగుతున్నాయి.

మాతరుతున్న అంతర్జాతీయ సమీకరణాలు

# మోడీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి

న్యూఢిల్లీ,ట్రంప్ సుంకాల బాదుడు వేళ అంతర్జాతీయ సమీకరణాలు మాతరుతున్నాయి. మోడీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా శాశ్వత మిత్రులు, శతృవులు ఉండరని రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నారు. ఆయా దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం.. శత్రుత్వం అంటూ ఏమీ ఉండదని, అలాగే శాశ్వత మిత్రులు కాని, శత్రువులు కాని ఉండరని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కేవలం ఏదేశానికి తగ్గట్లుగా ఆ దేశానికి ఉపయోగపడే శాశ్వత ప్రయోజనాలే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రక్షణరంగంలో ఆత్మనిర్భరత సాధించడం అత్యావశ్యకమని ఓ జాతీయ మీడియా సదస్సులో పాల్గొని మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి-ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రధాని మోదీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్ అనుసరిస్తోన్న వైఖరిని వెల్లడించారు. ప్రపంచం వేగంగా మారుతోంది. అదే సమయంలో కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. మహమ్మారులు, ఉగ్రవాదం, ప్రాంతీయ ఘర్షణలు వంటి వాటితో ఈ శతాబ్దం అత్యంత సవాలుతో కూడి ఉందని అర్థమవుతోంది. ఈనేపథ్యంలో మన వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా.. ఆత్మనిర్భరత అనేది అత్యావశ్యకం అన్నారు. మనకు శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. భారత్ ఎవరినీ శత్రువుగా పరిగణించదని కూడా వెల్లడించారు. మన రైతులు, వ్యాపారవేత్తల ప్రయోజనాలే మనకు ముఖ్యం. ప్రస్తుతం మారుతున్న భౌగోళిక రాజకీయాల కారణంగా రక్షణ పరంగా విదేశాలపై ఆధారపడటం సరైన ఎంపిక కాదని స్పష్టమవుతోందని అన్నారు. స్వావలంబన అనేది మన ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యవసరం. 2014లో మన రక్షణ రంగం ఎగుమతుల విలువ రూ.700 కోట్లు-. ఇప్పుడది రూ.24వేల కోట్లకు చేరింది. ఈ గణాంకాలు చూస్తుంటే.. భారత్ ఒక కొనుగోలుదారుగానే మిగలకుండా ఎగుమతిదారుగా మారుతుందని వెల్లడవుతోంది. ఇక మన బలగాలు స్వదేశీ పరికరాలతో లక్ష్యాలపై కచ్చితత్వంతో చేసిన దాడులు.. దూరదృష్టి, సమన్వయానికి నిదర్శనం. అలాంటి సన్నద్ధత లేకపోతే ఏ మిషన్ విజయవంతం కాదని మంత్రి రాజన్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత్‌ను మిత్ర దేశం అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల మోత మోగించారు. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు గతంలో విధించిన 25 శాతానికి అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించారు. అవి ప్రస్తుతం అమలవుతున్నాయి. ఈ తరుణం లోనే ఏడేళ్ల తర్వాత తొలిసారి ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.అయితే ఆసియాలో బలమైన కూటమి ద్వారా అమెరికాను ఎదుర్కోవాలన్న అభిప్రాయం కూడా బలపడుతోంది.

## ప్రజలకు అనుగుణంగా పాలన

నెల్లూరు, ప్రజల అవసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగడమే ప్రజాపాలన అని ఏపీ పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం అదే చేస్తోందని అన్నారు. వైకాపా ప్రభుత్వం మాపై కక్షతో అనేక పనులు నిలిపివేసిందని నారాయణ అన్నారు. నెల్లూరులో పర్యటించిన ఆయన.. 15వ డివిజన్ రౌండ్ తూము వద్ద రోడ్డు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఏం కావాలో తెలుసుకొని

# మహారాష్ట్రలో మరాఠా కోటా మంటలు.. హైదరాబాద్ గెజిట్ దే కీలకపాత్ర



ముంబై:మహారాష్ట్రలో మళ్లీ మరాఠాల ఓబీసీ రిజర్వేషన్ ఉద్యమం ఊపందుకుంది. రెండేళ్ల కిందటి నుంచి నలుగుతున్న ఈ డిమాండ్ ను సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే ముందుండి నడిపిస్తున్నారు. గత ఏడాది ఎన్నికల ముంగిట ఆయన చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. అప్పటికి చల్లబడినా.. మళ్లీ ఇప్పుడు గట్టిగా లేవనెత్తుతున్నారు. మరాఠాలు మహారాష్ట్ర జనాభాలో 28 శాతం ఉంటారని గతంలోనే ప్రభుత్వం పేర్కొంది. వీరికి 10 శాతం రిజర్వేషన్లు కోరుతూ ఉద్యమిస్తున్నారు జరాంగే. మరాఠాలను కున్బీలుగా గుర్తించాలంటున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్, సతారా గెజిట్ లను గుర్తుచేస్తున్నారు.

అప్పట్లో మహారాష్ట్ర వరకు నిజాం రాజ్యం

హైదరాబాద్ గెజిట్ ను 1918లో అప్పటి నిజాం రాజు జారీ చేశారు. అప్పట్లో నిజాం రాజ్యం మహారాష్ట్రకూ కొంతమేర విస్తరించి ఉంది. హైదరాబాద్ స్టేట్ గా పిలిచే నాటి రాజ్యంలో మరాఠాలు ఎక్కువగా ఉన్నా.. ఉద్యోగాలు, పాలనలో సరైన ప్రాతినిధ్యం దక్కడ లేదనే వాదన ఉంది. దీంతో సమస్య పరిష్కారానికి నిజాం రాజు.. మరాఠా వర్గాలను హిందూ మరాఠాలుగా గుర్తిస్తూ వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారు. ఈ మేరకు గెజిట్ ఇవ్వడంతో అది హైదరాబాద్ గెజిట్ అయింది.

నాటి గెజిట్ ను చూపుతూ...

మరాఠాలు సామాజికంగా, విద్య పరంగా వెనుకబడి ఉన్నారని రికార్డుల్లోనే ఉందని పేర్కొంటూ కోటా అమలు చేయాలని మరాఠా ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్ తో పాటు సతారా గెజిట్ లను చూపుతూ రిజర్వేషన్లు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఓబీసీ జాబితాలో చేర్చి 10 శాతం రిజర్వేషన్ కోరుతూ జరాంగే ఉద్యమం లేవనెత్తారు. మరాఠాలను కున్బీలుగా గుర్తించాలని కోరుతున్నారు. కానీ, మరాఠాలు– కున్బీలు ఒకటి కాదంటూ గతంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని ప్రభుత్వం పేర్కొంటోంది. సుప్రీం ఆదేశాలను కాదనలేం కాబట్టి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, జరాంగేతో చర్చలు విఫలమయ్యాయి.

రెండో రోజూ నిరాహార దీక్ష

కోటా అమలు కోరుతూ జరాంగే చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం మూడో రోజూ కొనసాగింది. ఆయనతో ప్రభుత్వ ప్రతినిధులు జరిపిన చర్చలు ఫలితం ఇవ్వలేదు. చర్చలకు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సందీప్ శిందేను పంపడాన్ని జరాంగే తప్పుబట్టారు. హైదరాబాద్, సతారా గెజిట్‌లను చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు.

# ట్రంప్ ఇండియా టూర్ రద్దు.. మోడీ చైనా పర్యటన ఎఫెక్టేనా?



న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది డిసెంబర్ లో భారత్ లో జరపాల్సిన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ ఏడాది చివరిలో ఇండియాలో జగరనున్న క్వాడ్ సదస్సులో ఆయన పాల్గొనాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఆయన దానిని రద్దు చేసుకున్నారు. భారత్ పై ట్రంప్ టారిఫ్ వార్.. ప్రతిగా ప్రధాని నరేంద్రమోడీ చైనా పర్యటన నేపథ్యంలో ట్రంప్ టూర్ రద్దు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అసలు ఆపరేషన్ సిందూర్ తరువాత నుంచి భారత్ – అమెరికాల మధ్య సంబంధాలు ఒకింత చెడ్డాయనే చెప్పాల్సి ఉంది. భారత్, పాకిస్థాన్ యుద్ధాన్ని తానే ఆపానని పదే పదే చెప్పుకుంటూ తనకు తానే శెహభాష్ అంటూ భుజ కీర్తులు తగిలించేసుకుంటున్న ట్రంప్ కు పాకిస్థాన్ తో కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో దేశం ప్రమేయం ఇసుమంతైనా లేదనీ, పాక్ బతిమలాడుకుని కాళ్ల బేరానికి రావడం వల్లనే సీజ్ ఫైర్ కు అంగీకరించామనీ భారత్ కుండబద్దలు కొట్టడం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు మింగుడు పడలేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.అలాగే రష్యా నుంచి చమురు దిగుమతుల విషయంలో కూడా ట్రంప్ అభ్యంతరాలను ఇండియా ఇసుమంతైనా ఖాతరు చేయకపోవడంతో కంగుతిన్న అమెరికా అధ్యక్షుడు భారత్ పై అదనపు సుంకాలు విధించారు. దీనిని కూడా లేక్క చేయని ఇండియా రష్యా నుంచి చమురు దిగుమతుల విషయంలో తగ్గేదే లే అని చేతల ద్వారా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే మోడీతో చర్చించేందకు ట్రంప్ పలు మార్లు ఫోన్ చేశారనీ, అయితే ఆ ఫోన్ కాల్స్ కు మోడీ స్పందించలేదనీ వార్తలు వినవచ్చాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు వెళ్లడంతో ట్రంప్ తన భారత్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు కాదా?



హైదరాబాద్,తెలంగాణ బీజేపీలో అంతర్గత కలహాలు ఆ పార్టీ పరిస్థితిని రాష్ట్రంలో నానాటికీ దిగజారేలా చేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలలో ఆ పార్టీ అధికారం చేజిక్కించుకోలేకపోవడానికి ఈ అంతర్గత విభేదాలే కారణమని పరిశీలకులు అప్పట్లోనే విశ్లేషించారు. అధిష్టానం జోక్యం కూడా రాష్ట్రంలో బీజేపీ పరిస్థితిని మెరుగుపరచచడంలో విఫలమైంది. ఇప్పటికీ రాష్ట్రపార్టీలో ముఠాల కుమ్ములాటలు, గ్రూపు తగాదాలూ అలాగే ఉన్నాయి. నాయకుల మధ్య విభేదాలు క్యాడర్ ను అయోమయానికి గురి చేస్తున్నాయి. తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు బహిరంగంగా ఆ పార్టీ ఎంపీ నుంచే ఘోర పరాభవం, అవమానం ఎదురైంది. విషయమేంటంటే.. త్వరలో ఉప ఎన్నిక జరగనున్న జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో అభ్యర్థి ఎంపిక, ఎన్నికల వ్యూహరచన తదితర అంశాలపై చర్చించేందుకు శనివారం పార్టీ సీనియర్లు, కీలక నేతలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు అవమానం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ మెదక్ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత రఘునందనరావు పదే పదే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పేర్కొన్నారు. ఒక సారి అయితే పొరపాటు అనుకోవచ్చు. కానీ రఘునందనరావు తన ప్రసంగంలో కనీసం అరడజను సార్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అని పేర్కొన్నారు. పరిశీలకులు, పార్టీ వర్గాలూ కూడా రఘునందనరావు ఉద్దేశపూర్వకంగా, రామచంద్రరావును అవమానించే లక్ష్యంతోనే అలా మాట్లాడారని అంటున్నారు. రఘునందనరావు, రామచంద్రరావు మధ్య విభేదాలు ఉన్నాయన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రామచంద్ర రావును అవమానించడం, చిన్నబుచ్చడమే లక్ష్యంగా రఘునందనరావు అలా వ్యవహరించారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# బీజేపీలో పెద్ద పదవి..విచారణ సంగతేంటి ?



విశాఖ:ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆడారి కుటుంబానికి రాజకీయంగా మంచి పేరు ఉంది. ఆడారి తులసీరావు ఏపీలో అతి పెద్ద డెయిరీని నడిపి పాల పారిశ్రామికవేత్తగా నిలిచారు. ఆయన టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ కి అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. ఆయన కోరుకుంటే పదవులు దక్కేవి కానీ టీడీపీకి మద్దతుదారుగా ఉంటూ విశాఖ రూరల్ జిల్లా రాజకీయాలలో కీలకంగా ఉంటూ వచ్చారు.

వారసుడి తడబాట్లు :

ఇక ఆయన మరణానంతరం కుమారుడు ఆడారి ఆనంద్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల పట్ల మక్కువ చూపించారు. అలా ఆయన 2019లో టీడీపీ నుంచి అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి వైసీపీ ప్రభంజనంలో ఓటమి పాలు అయ్యారు. ఆ తరువాత వైసీపీలో చేరి 2024 ఎన్నికల్లో విశాఖ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు.

కూటమి టార్గెట్ :

అయితే ఆయన కుటుంబం అంతా మొదటి నుంచి టీడీపీలో ఉంటూ సడెన్ గా కండువా మార్చేసి వైసీపీలో చేరారు అన్న కారణంతో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ డెయిరీ మీద విచారణకు సిద్ధపడింది. అలా విశాఖ డెయిరీ మీద అసెంబ్లీలో కూడా చర్చ సాగింది. అక్కడ అంతా అవకతవకలు జరిగాయని విచారణ చేపట్టాలని కూడా స్థానిక ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. దీంతో సీనియర్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో సభా సంఘాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించారు. ఈ సభా సంఘం డెయిరీ వచ్చి మరీ విచారణ చేపట్టింది.

ఇంతలోనే కాషాయం చెంతకు :

ఇదిలా ఉండగా ఆడారి ఆనంద్ కుమార్ వైసీపీకి రాజీనామా చేసి బీజేపీలోకి చేరిపోయారు. అలా ఆయన కూటమిలోకి వచ్చేసినట్లు అయింది ఇక విశాఖ జిల్లా నుంచి కొత్తగా ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ అయిన పీవీఎన్ మాధవ్ తాజాగా రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించారు. అందులో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కీలకమైన పదవిని ఆడారి ఆనంద్ కుమార్ కి ఇచ్చారు. దాంతో ఆయనకు పెద్ద పదవి దక్కినట్లు అయింది.

విచారణ ఉంటుందా :

ఇక ఆడారికి ఇపుడు ఏపీ బీజేపీలోనే కీలక స్థానం దక్కడంతో ఆ పార్టీ కూటమిలో ఉండడంతో ఆయన నాయకత్వంలోని విశాఖ డెయిరీ మీద వేసిన విచారణ సంఘం దర్యాప్తు ముందుకు వెళ్తుందా అన్నది చర్చగా ఉంది. కూటమిలో బీజేపీ మిత్ర పక్షగా ఉంది ఆనంద్ కూడా రాష్ట్ర స్థాయి పదవిలో ఉన్నారు. మరి ఆయన మీద దూకుడుగా వెళ్ళగలరా అని సందేహాలు అయితే ఉన్నాయి. మరి మొదట్లో అంతా కలసి డెయిరీలో తీవ్ర స్థాయిలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు కాబట్టి దానిని బట్టి ముందుకు వెళ్తేనే నిజాయతీ నిగ్గు తేలినట్లు అని అంటున్నారు.అయితే అలా జరిగేది ఉండదని రాజకీయంగా చూస్తే కనుక ఆడారి సేఫ్ జోన్ లో ఉన్నట్లే అని అంటున్న వారే ఎక్కువగా ఉన్నారు. సో సభా సంఘం విచారణ ఏ రూపు తీసుకుంటుంది అన్నదే ఆలోచించాలని అంటున్నారు. మొత్తానికి కమలం కండువా కప్పుకుని ఆడారి కుటుంబం తమ ప్రత్యర్ధులకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చిందని అంటున్నారు.

# పెద్దారెడ్డికి ఈసారి అయినా ఎంట్రీ ఉంటుందా ?



అమరావతి,ఏపీలోని కొందరు వైసీపీ నేతలు తమ నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్నారు. కొందరు అయితే సైలెంట్ గా ఉంటుంది ఎవరు ఎలా ఉన్నా తమ సొంత నియోజకవర్గాలలో తమ నివాసాలలోనే ఉంటున్నారు. కానీ ఎక్కడ లేని బాధాలూ తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికే వచ్చాయని ఆయన అనుచరులు అంటున్నారు. మా నాయకుడికి ఓటమి ఒక్కటే బాధ కాదు అని తాడిపత్రికి గత పదిహేను నెలలుగా దూరం పెట్టడమే అతి పెద్ద బాధగా మారింది అని వాపోతున్నారు.

జేసీ వర్సెస్ పెద్దారెడ్డి :

తాడిపత్రి అంటే గత నాలుగు దశాబ్దాలుగా జేసీ ఫ్యామిలీ చేతులలోనే ఉంది. అనేక దఫాలుగా జేసీ దివాకర్ రెడ్డి, అలాగే ప్రభాకర్ రెడ్డి అక్కడ గెలిచారు. ఇపుడు చూస్తే ప్రభాకర్ రెడ్డి కుమారుడు జేసీ అస్మిత్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక ఎమ్మెల్యేగా చేసి 2021లో జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో వైసీపీ అధికారంలో ఉండగా తాడిపత్రి మున్సిపాలిటీ చైర్మన్ అయిన వారు జేసీ ప్రభాకర్ రెడ్డి. ఆయన మొత్తం టీడీపీకే ఆనాడు పొలిటికల్ ఐకాన్ గా మారారు. అంతే కాదు తాడిపత్రిలో అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న కేతిరెడ్డి పెద్దారెడ్డిని ధీటుగా ఎదుర్కొన్నారు. అలా ఇద్దరు మధ్య పొలిటికల్ వార్ అయితే సాగుతూనే ఉంది

తాడిపత్రిలో నో ఎంట్రీ బోర్డు:

ఇక కేతిరెడ్డి పెద్దారెడ్డి ఓటమి పాలు అయ్యాక ఆయనకు తాడిపత్రి వచ్చేందుకు సైతం వీలు లేకుండా పోయింది జేసీ ప్రభాకరరెడ్డి ఆయన వస్తే ససేమిరా ఊరుకోమని అంటున్నారు. దాంతో నో ఎంట్రీ బోర్డు పడిపోయింది. ఇక మొదట్లో తానుగా సొంత బలంతో తాడిపత్రికి వచ్చిన ప్రతీసారీ పోలీసులు ఆయనను తీసుకుని వెళ్ళి ఊరి పొలిమేరలకు దాటించి వచ్చారు. ఇది లాభం లేదని న్యాయ పోరాటం కూడా పెద్దిరెడ్డి చేశారు.

సుప్రీం కోర్టు దాకా :

తనను తన సొంత నియోజకవర్గం వెళ్లనీయడం లేదని చెబుతూ హైకోర్టులో పెద్దిరెడ్డి పిటిషన్ దాఖలు చేస్తే సింగిల్ బెంచ్ ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే డివిజన్ బెంచ్ మాత్రం స్టే విధించింది. దాని మీద పట్టు వదలని విక్రమార్కుడి మాదిరిగా పెద్దిరెడ్డి ఏకంగా సుప్రీం కోర్టుకు వెళ్లారు. అక్కడ స్టే వెకేట్ చేయించుకున్నారు. దాంతో ఆయన మరోసారి తాడిపత్రి వైపు చూస్తున్నారు.

రేపో మాపో రచ్చేనా :

ఇక పెద్దిరెడ్డి తాను తాడిపత్రి వెళ్తాను ఈసారి ఎవరు అడ్డుకుంటారో చూస్తాను అని అంటున్నారు. జేసీ దివాకర్ రెడ్డి అధికార పార్టీ అండతో తనను అడ్డుకుంటున్నారు అని ఆయన విమర్శిస్తున్నారు. అయితే పెద్దిరెడ్డిని తాము అడ్డుకోవడం లేదని ఆయన అయిదేళ్ళ పాటు ఎమ్మెల్యేగా చేసిన అరాచకాలకు బాధితులుగా ఉన్న వారే ఆయనను అడ్డుకుంటారని జేసీ ప్రభాకర రెడ్డి అంటున్నారు. మొత్తం మీద తాడిపత్రిలో ఎలాగైనా అడుగు పెడతాను అని పెద్దారెడ్డి అంటూంటే వస్తే వెనక్కే అంటున్నారు జేసీ. ఈ మధ్యలో తమకు అసలు సిసలు పరీక్షగా ఇందంతా ఉందని తాడిపత్రి పోలీసులు యమ టెన్షన్ పడుతున్నారు. ఇంతకీ తాడిపత్రికి పెద్దారెడ్డి రాగలరా లేక గతంలో మాదిరిగానే వెనక్కి వెళ్తారా ఏమో రెండు మూడు రోజులోలలో ఆ ముచ్చటా తెలిసిపోతుంది అని అంటున్నారు.

# సీక్రెట్‌గా షోకాజ్ నోటీసులు.. తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుంది?




హైదరాబాద్, తెలంగాణ బిజేపి లో షోకాస్ నోటీసులు ఇష్యూ హాట్ టాపిక్ గా మారింది. షోకాస్ నోటీసులు పంచాయతీ బిజెపి రాష్ట్ర కార్యాలయానికి చేరింది. బిజెపి రాష్ట్ర అధ్యక్ష జిల్లా పర్యటనలో నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. అధ్యక్షుడి ముందే బాహ బాహీకి దిగుతున్న జిల్లా నేతలను కంట్రోల్ చేసే పనిలో పడింది రాష్ట్ర నాయకత్వం. ఆ క్రమంలో నోటీసులు ఇచ్చి వివరం తీసుకునే తెలిసే ప్రక్రియకు తెరలేపారు. అలా బిజేపీలో గుట్టు చప్పుడు కాకుండా షోకాస్ నోటీసులు ఇచ్చేసి వివరణలు తీసుకోవటం పార్టీలో తీవ్ర చర్చనియాంశంగా మారింది.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో నేతల బాహాబాహీకి దిగుతున్న నేతలు

తెలంగాణ కాషాయ పార్టీలో వర్గపోరు రోజురోజుకు పెరిగిపోతోంది. ఆఖరికి కొత్త రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు సమక్షంలోనే జిల్లా పార్టీ నేతలు బాహాబాహీకి దిగుతున్నారు. ఈ పరిస్థితి చినికి చినికి గాలివానగా మారేలా పరిస్థితి దాపురించిందనే టాక్ నేతల మధ్య నడుస్తోందట. అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలోనే నేతల మధ్య వర్గ విభేదాలు బయటపడడంతో పార్టీలో చర్చనీయ అంశంగా మారిందట.

వర్గపోరును కట్టడి చేసేందుకు సిద్ధమైన పార్టీ నాయకత్వం

రాష్ట్ర బిజేపీ చీఫ్ పర్యటనలో బయటపడ్డ వర్గపోరును కట్టడి చేసేందుకు పార్టీ నాయకత్వం నడుము బిగించిందట. వర్గపోరుకు కారణమవుతున్న నేతలకు మూడో కంటికి తెలియకుండా షోకాజ్ నోటీసులను పంపించిందట రాష్ట్ర బిజెపి నాయకత్వం. వారికి సంజాయిషి ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాల నుంచి పలువూరు నేతలు హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి క్యూ కట్టారు. నాయకత్వం రాతపూర్వకంగా వారి వివరణ తీసుకుందట. అయితే ఈ ప్రక్రియ మొత్తం గుట్టు చప్పుడు కాకుండా చేపడుతూ ఉండడం గమనార్హం. కాగా వివరణ ఇచ్చేందుకు పలువురు నాయకులు కార్యకర్తలు స్టేట్ ఆఫీస్ కు క్యూ కట్టడంతో ఈ విషయం బహిర్గతమైంది.

పార్టీలో రచ్చకెక్కుతున్న కమిటీ నియామకాల అంశం

కమలం పార్టీలో కమిటీల అంశంపై రచ్చకెక్కుతూ ఉండడం హాట్ టాపిక్ గా మారింది. త్వరలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు జిల్లాల పర్యటనలు చేపడుతున్నారు. శ్రేణుల్లో జోష్ నింపాలని భావించి ఆయన ఈ టూర్లు వేస్తున్నారు. ఎందుకంటే కొత్త కమిటీలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో వారికి ఈ టూర్లతో బూస్ట్ ఇచ్చినట్లు అవుతుందని భావించి ఆయన పర్యటనను కొనసాగిస్తూ ఉండగా పలు జిల్లాల్లో వర్గపోరు బహిర్గతమైంది. రామచంద్రరావు ఎదుటే బాహాబాహికి దిగుతున్నారు. సొంత పార్టీ అయి ఉండి ఒక వర్గం నాయకుడిపై మరో వర్గం నాయకులు విమర్శలు చేస్తూ ఉండడంతో పార్టీ ప్రతిష్ట దిగజారిపోతుంది. అందుకే దీనికి చెక్ పెట్టడంపై రాష్ట్ర నాయకత్వం సమాలోచనలు చేసి నోటీసులు పంపి వారి వివరణ కోరినట్లు తెలుస్తుంది.

పెద్దపల్లిలో బహాబాహీకి దిగిన ప్రదీప్ రావు, రామకృష్ణారెడ్డి వర్గీయులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల పెద్దపల్లి జిల్లా పర్యటనకు వెళ్ళారు. అక్కడ దుగ్యాల ప్రదీప్ రావు గుజ్జుల రామకృష్ణ రెడ్డి వర్గీయులు ఒకరిపై ఒకరు పరస్పరం విమర్శలు చేసుకుంటూ బాహాబాహికి దిగారు. అలాగే మహబూబ్ నగర్ పర్యటనలోను రామచంద్ర రావుకు ఇదే తరహ అనుభవం ఎదురైంది. ఎంపిడికే అరుణకు వ్యతిరేకంగా సొంత పార్టీ వారు నినాదాలు చేశారు. దానికి తోడు కరీంనగర్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎంపి ఈటల రాజేందర్ నడుమ వర్కపోరు. రంగారెడ్డి జిల్లా నేతలపై ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి అసహనం నిజామాబాద్లో కమిటీల ఇష్యూ పై ఎంపి ధర్మపురి అరవింద్ అసహనం వ్యక్తం చేయడంతో సదరు వివాదాలకు చెక్ పెట్టే దిశగా రాష్ట్ర నాయకత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది.నోటీసులు అందుకున్న పెద్దపల్లి బీజేపీ నాయకులు కార్యకర్తలు నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి తమ వివరణను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆర్గనైజింగ్ సెక్రటరీలకు లిఖితపూర్వకంగా అందచేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన దాదాపు ఏడుగురికి ఈ నోటీసులు అందాయి. ఇదిలా ఉండగా పాలమూరు జిల్లా నాయకుడు పార్టీ రాష్ట్ర కోషాధికారి శాంతి కుమార్ సైతం ఇప్పటికే తన వివరణను రాష్ట్ర నాయకత్వానికి రాధపూర్వకంగా అందించినట్లు తెలిసింది. రాష్ట్ర కార్యాలయానికి పలు జిల్లాల పంచాయితీ చేయడంతో గుట్టు చప్పుడు కాకుండా నోటీసులు అందించిన అంశం బయటకు పొక్కింది. ఇంత సైలెంట్ గా షో కాజ్ నోటీసులు ఇచ్చి వారి వివరణ కోరడంతో పార్టీలో తీవ్ర చర్చనీయా అంశంగా మారింది. కాగా త్వరలో మరికొంతమందికి సైతం నోటీసులు అందించే అవకాశాలు ఉ

# బొత్స స్కెచ్ అదిరింది.. వైసీపీకి చాన్సేనా?



అమరావతి,సీనియర్ నేతగా వ్యూహకర్తగా బొత్స సత్యనారాయణ ట్రాక్ రికార్డ్ గొప్పది. ఆయన ఉత్తరాంధ్రలో తన రాజకీయ పథకాలతో ప్రత్యర్ధులను అధిగమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు వైసీపీని విశాఖతో పాటు ఉత్తరాంధ్రా జిల్లాలలో లేపేందుకు ఆయన భారీ కార్యాచరణను ఎంచుకున్నారు.సెంటిమెంట్ తోనే ఆయన ముందుకు వస్తున్నారు. ఉత్తరాంధ్రకే కాకుండా ఏపీకే సెంటిమెంట్ గా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇష్యూలో బొత్స సత్యనారాయణ ఇపుడు గేర్ మార్చారు స్పీడ్ పెంచారు. ఆయన నాయకత్వంలో వైసీపీ ఉక్కు పోరాటాలకు సంసిద్ధం అవుతోంది.ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని దానిని ఆపేందుకు ఏపీలో కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదని వైసీపీ ఆరోపిస్తోంది. ఈ క్రమంలో విశాఖ ఉక్కుని కాపాడుకునేందుకు కదం తొక్కాల్సిందే అని వైసీపీ పిలుపు ఇస్తోంది.విశాఖలో జరిగిన జిల్లా స్థాయి వైసీపీ సమావేశంలో కార్యాచరణను రూపొందించారు. రౌండ్ టేబిల్ సమావేశాలతో పాటు కలసి వచ్చే పార్టీలతో కలసి ఉక్కు మీద ఉద్యమించాలని వైసీపీ నిర్ణయించింది. విశాఖ ఉక్కు పోరాటంలో వైసీపీ ముందుండాలని చూస్తోంది.కూటమి పార్టీలు ఎటూ ఆ వైపున ఉంటాయి కాబట్టి కలసి వచ్చే పార్టీలతో కలిసి ఉక్కు పోరాటాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా విశాఖలో రాజకీయంగా మళ్ళీ పునర్ వైభవం పొందాలని అనుకుంటోంది. 2021లో ఉక్కు మీద పోరాటం చేయడం ద్వారా ఆనాటి ప్రతిపక్ష టీడీపీ కార్పోరేషన్ ఎన్నికల్లో బాగానే లాభపడింది.వైసీపీ కూడా అదే ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. వైసీపీకి ఓటమి తరువాత దాదాపుగా ఏణ్ణర్ధం కాలం గడచిన నేపథ్యంలో ఉక్కు రూపంలో ఒక చక్కని అవకాశం అయితే దక్కింది. స్వామి కార్యక్రం స్వకార్యం అన్నట్లుగా ఉక్కుని నిలబెడుతూ పార్టీని కూడా నిలబెట్టుకున్నట్లు అయితే విశాఖలో వైసీపీకి సానుకూల వాతావరణం ఏర్పడుతుందని అంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com